నత్తేనయం!

చేర్యాలలో కొనసాగుతున్న సర్కారు దవాఖాన నిర్మాణ పనులు

- నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధితశాఖ అధికారులు
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

చేర్యాల, మే 13: మండల కేంద్రంలో సర్కారు దవాఖాన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.ప్రజలకు ఉపయోగపడే భవనాలను సకాలంలో పూర్తిచేయించేందుకు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చేర్యాలలో నిర్మాణంలో ఉన్న 30 పడకల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. జనవరి 16, 2023న ప్రారంభమైన నిర్మాణ పనులు కొన్ని మాసాలుగా కాంట్రాక్టర్ కొనసాగిస్తుండడంతో విమర్శలకు తావిస్తున్నది. పాత నియోజకవర్గ కేంద్రమైన చేర్యాల పట్టణంలో కొత్తగా దవాఖాన నిర్మించేందుకు బీఆర్ఎస్ సర్కారు రూ. 9కోట్లు మంజూరు చేసింది. అసెంబ్లీ వేదికగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. సంబంధిత వైద్యశాఖ సెక్రటరీ, అధికారులను సైతం కలిసి సమస్యను వివరించారు. దశాబ్దాల క్రితం పట్టణంలో నిర్మించిన దవాఖాన భవనంలో ప్రజలకు సరిపడా వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో అప్పటి ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నేరుగా పాత దవాఖానను సందర్శించి వైద్యులతో పాటు రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేర్యాలలో నూతనంగా దవాఖాన భవనం అవసరమని గుర్తించి వెంటనే రూ. 9కోట్లు మంజూరు చేసి భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆధునిక వసతులతో కొత్తగా దవాఖాన భవనం నిర్మించేందుకు వ్యవసాయ మార్కెట్ యార్డు వెనుక భాగంలో బీడీ కాలనీకి వెళ్లే రహదారిలో పాలశీతలీకరణ కేంద్రం పక్కనే స్థలాన్ని గుర్తించారు. టెండర్ల ప్రక్రియ తదితర వాటిని పూర్తి చేసిన అనంతరం పనులను ప్రారంభించారు.నూతన భవనంలో 30 పడకలతో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఫస్ట్‌ఫ్లోర్, పక్కనే మరో వార్డు నిర్మించేందుకు టెండరుదారుడు పనులు ప్రారంభించారు. నూతన భవనంలో గైనిక్ వార్డు, పిడియాట్రిక్ వార్డు, ఓపీ, ఐపీ వార్డులతో పాటు లేబర్ రూమ్, ఆధునిక వసతులతో ఆపరేషన్ థియేటర్స్ నిర్మించారు.బీఆర్ఎస్ సర్కారు మంజూరు చేసిన నిధులతో భవనం వరకు పనులు పూర్తి చేశారు.కానీ ప్రహరీ నిర్మాణ పనులు, పోస్ట్‌మార్టం గది నిర్మాణం, ప్రధాన రహదారి నుంచి దవాఖాన వరకు అప్రోచ్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెండింగ్ పనులకు నిధులు వస్తే పనులు పూర్తికానున్నాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తే చేర్యాల పట్టణంతో పాటు చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు,ధూళిమిట్ట మండల ప్రజలతో పాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని 10 గ్రామాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుంది. పనులు ప్రారంభించినప్పటి నుంచి సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కాంట్రాక్టర్ సైతం పనులను నత్తనడకన కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై చేర్యాల సీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యుడు దేవేందర్‌ను ఫోన్‌లో వివరణ కోరగా భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని, కాంపౌండ్, పోస్ట్ మార్టం గది పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పనులు పూర్తి కాగానే నూతన భవనంలోకి దవాఖానను మారుస్తామన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే దేవాలయాలకు పెద్దపీట

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



ఎల్లమ్మ కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్,మే 13 : బీఆర్ఎస్ హయాంలోనే దేవాలయాలకు పెద్దపీట వేసినట్లు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లిలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎల్లమ్మ ఆలయం నిర్మించారు. మంగళవారం ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠతో పాటు కల్యాణం వైభవంగా నిర్వహించారు.ఈ ఉత్సవాలకు దుబ్బాక ఎమ్మెల్యే హాజరై పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ గౌడ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ దౌల్తాబాద్ మండల అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్, గ్రామ గౌడ సంఘం సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ చిత్తారిగౌడ్, దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్‌ప్రేమ్‌దీప్,గ్రామ గౌడ సంఘం యూత్ సభ్యులు, వివిధ గ్రామాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

దౌలాపూర్‌లో బాబు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవపూర్, మే13: మండలంలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన బాబు వారం రోజుల క్రితం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి బీఆర్ఎస్ మండల నాయకులతో కలిసి మంగళవారం అతడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల నాయకుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్, గ్రామ శాఖ అధ్యక్షుడు జూపల్లిమధు, నాయకులు సిద్ధులు, జయమ్మ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

పోతారెడ్డిపేటలో గోప దేవవ్వ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

పోతారెడ్డిపేటలో చంద్రవ్వ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక,మే13: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధిహామీ కూలీల కుటుంబాలను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధిహామీ కూలీలు బ్యాగరి చంద్రవ్వ, గోప దేవవ్వ మృతిపై ఆయన విచారం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం ఆయన హైదరాబాద్ నుంచి పోతారెడ్డిపేటకు చేరుకుని మృతదేహాల వద్ద నివాళులర్పించారు. ఉపాధి కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. దుబ్బాక పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ కృష్ణ పాల్గొన్నారు.

బెజ్జంకి తహసీల్దార్ బదిలీ

తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

బెజ్జంకి, మే 13: బెజ్జంకి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం బదిలీపై వెళ్లారు. సిద్దిపేట రూరల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకట్‌రెడ్డి బెజ్జంకి తహసీల్దార్‌గా బదిలీపై రానున్నారు. కాగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డిని కార్యాలయ అధికారులు, సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గోపాల్, ఆర్ఐలు సంతోష్, సుహాసిని, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు నీతి కథలు బోధించాలి

యోగాసనాల సాధన చేయిస్తున్న అశోక్

సిద్దిపేట టౌన్, మే 13: చిన్నారులకు నీతి కథలు బోధించాలని వైద్యుడు సుష్మిత్ సూచించారు. రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మ్యాడ్యులస్ పాఠశాలలో కొనసాగిన వేసవి వివేక్ సంస్కార్ ఉచిత శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మానసిక క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించడానికి ఇలాంటి సమ్మర్ కాంపులు ఉపయోగపడుతాయన్నారు. అంతకు ముందు యోగా గురువు అశోక్ యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నాగేందర్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు, సురేందర్‌రెడ్డి, బాలభాస్కర్ పాల్గొన్నారు.

హనుమాన్ మాలధారణ స్వాములకు భిక్ష

భిక్ష చేస్తున్న మాలధారణ స్వాములు

కోహెడ, మే 13: గవ్వ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గవ్వ వంశీధర్‌రెడ్డి మంగళవారం స్థానిక హరిహర క్షేత్రంలో హనుమాన్ మహాస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు కోహెడ ప్రసాద్‌రావుశర్మ హనుమాన్ మహాస్వామికి పంచామృత అభిషేకం, మాన్యుసూక్త అభిషేకం, మంత్రపుష్పం, మంగళహారతిపూజలు చేశారు. అనంతరం హనుమాన్ మాలధారణ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

పిల్లలను తీర్చిదిద్దాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు

సిద్దిపేట, మే 13 : బాల్యం అమూల్యమైనదని.. పిల్లలను అద్భుతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని చంద్రమౌళి గార్డెన్‌లో వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల సంస్కార్ ముగింపునకు ఆమె హాజరయ్యారు.వివిధ విన్యాసాల్లో ప్రతిభ కనబర్చిన పిల్లలకు బహుమతులు అందజేశారు. సిద్దిపేట ఏసీపీ మధు, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, కొమురవెల్లి అంజయ్య, చిప్ప ప్రభాకర్, అయిత అంజయ్య పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ మనుచౌదరి

ఉమ్మాపూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

హుస్నాబాద్‌టౌన్, మే 13: హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులను వేగవంతం చేయాలని, ఇందుకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ తాగునీటి ట్యాంక్ పక్కన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నిర్మించే విషయంపై అధికారులతో ఆయన చర్చించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. 150 పడకలు మంజూరయ్యాయని, పాత భవనాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాత భవనంలో ఉన్న పలు విభాగాలను నూతన భవనంలోకి మార్చి సేవలు అందించాలని ఆయన సూచించారు. ఆర్డీవో రామ్మూర్తి, జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉమ్మాపూర్, జిల్లెలగడ్డలో...

హుస్నాబాద్‌రూరల్, మే 13: మండలంలోని ఉమ్మాపూర్, జిల్లెలగడ్డ శివారులో మంగళవారం కలెక్టర్ మనుచౌదరి పర్యటించారు. జిల్లెలగడ్డ ప్రాంతంలో నేషనల్ అకాడమిక్ సెంటర్ భవన నిర్మాణానికి సేకరించిన స్థలాన్ని, ఉమ్మాపూర్ శివారులో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి ప్రతిపాదించిన గుట్ట ప్రాంతాన్ని సందర్శించారు. త్వరగా ప్రతిపాదిత స్థలాలను చదును చేసి శంకుస్థాపనలకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఉన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

సిద్దిపేటలో నామినేషన్ వేస్తున్న కాముని రాజేశం

సిద్దిపేట టౌన్,మే 13 : సిద్దిపేట పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మంగళవారం మొదటి రోజు కాముని రాజేశం తన ప్యానల్‌తో కలిసి మర్కండేయస్వామి దేవాలయ ప్రాంగణంలోని కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ అధికారులు గౌరీ మోహన్, భిక్షపతి, సత్యనారాయణ మాట్లాడుతూ..నామినేషన్ల ప్రక్రియ బుధవారం వరకు కొనసాగుతుందని, ఈ నెల 25న పద్మశాలి సమాజం ఎన్నికలు జరుగుతాయన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటలో సమ్మర్ కాంపు గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, మే 13 : పిల్లల ఎదుగుదలకు శారీరక దారుఢ్యం అవసరమని సంక్షేమ సిద్ధియోగా ప్రతినిధి పెద్ది మనోహర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సమ్మర్ కాంపు గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..పిల్లల్లో ఆధ్యాత్మికత, మానసిక ఉల్లాసం పెంపొందించడానికి సిద్దిపేట సుందర్ సత్సంగ భవన్‌లో పది రోజులు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో యోగాసనాలు, సూర్యనమస్కారాలు, ఆత్మరక్షణకు కర్ర సాము, విలు విద్య, చిత్రలేఖనం, జానపద నృత్య శిక్షణ, భగవద్గీత పఠనం, పూజా విధానం నేర్పిస్తామన్నారు. సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సభ్యులు ప్రభుదాస్, మనోహర్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పంటల మార్పిడితోనే ప్రయోజనం

హబ్షీపూర్‌లో పంటలసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

దుబ్బాక,మే13: పంటల మార్పిడితోనే ప్రయోజనమని దుబ్బాక ఏవో ప్రవీణ్, తోర్నాల వ్యవసాయ పరిశోధన కళాశాల శాస్త్రవేత్తలు శ్రీజయ , ఉమారాణి రైతులకు సూచించారు. దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో మంగళవారం ''రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఒకే రకమైన పంటతో పాటు అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని రైతులకు సూచించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగుచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు, రైతు నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి

- అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

అక్కెనపల్లిలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నంగునూరు, మే 13 : ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ మండల ప్రత్యేకాధికారి దేవకీదేవి, మండల అభివృద్ధి అధికారి లక్ష్మప్పను ఆదేశించారు. మంగళవారం మండలంలోని అక్కెనపల్లిలో రైతు నాగేంద్రం సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటను ఆయిల్‌ఫెడ్ అధికారి భాస్కర్‌రెడ్డితో కలిసి ఆమె సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలం పాటు ఆదాయం వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఆమె సూచించారు. అనంతరం నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికపై అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పాలమాకులలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. అంతకు ముందు నంగునూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీవో ప్రభాకర్‌రావు, ఏపీఎం మహిపాల్ పాల్గొన్నారు.

పాలమాకులలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్

బ్యాంకులకు చేరుతున్న రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు

హుస్నాబాద్‌లో బ్యాంకుల వారీగా దరఖాస్తులను వేరుచేస్తున్న ఆర్పీలు

హుస్నాబాద్ టౌన్, మే 13: రాజీవ్‌యువ వికాసం కోసం చేసుకున్న దరఖాస్తులు ఎట్టకేలకు బ్యాంకులకు చేరుతున్నాయి. హుస్నాబాద్ పట్టణంలోని యూనియన్, యూకో, కెనరా, ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ, కేడీసీసీ, హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను ఆయా బ్యాంకులకు మెప్మా అధికారులు పంపుతున్నారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన 1,853 మంది రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్నట్లు మెప్మాకోఆర్డినేటర్ సంతోషిని తెలిపారు. ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు పలు ధ్రువపత్రాలను జతపర్చలేదని, కొందరు దరఖాస్తులను సైతం సమర్పించలేదని ఆమె వివరించారు. ఇప్పటి వరకు 1,539మంది దరఖాస్తులు మాత్రమే మున్సిపల్‌కు చేరాయని, మిగతావారు సైతం దరఖాస్తులతోపాటు ధ్రువపత్రాలను రెండు రోజుల్లో మున్సిపల్ మెప్మా కార్యాలయంలో అందించాలని ఆమె సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

మద్దూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మద్దూరు(ధూళిమిట్ట), మే13: మద్దూరు రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో రామకృష్ణ మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో మద్దూరు మండలంలో 150 ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. మొక్కలకు డ్రిప్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయిల్‌పామ్ పంటలో మూడేండ్లు అంతరపంటగా ఇతర పంటలు సాగుచేసుకునే వీలుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజు, అనూష పాల్గొన్నారు.

యూరియా తక్కువ మోతాదులో వాడాలి

కొత్తూరులో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త వాణిశ్రీ

ములుగు, మే 13 : యూరియా తక్కువ మోతాదులో వాడి పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని ఏడీఏ అనిల్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని లక్ష్మక్కపల్లి, అచ్చాయపల్లి, కొత్తూరు గ్రామాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రసాయనాల వినియోగాన్ని తగ్గించి నేలలోని పోషకాలను కాపాడాలన్నారు. సాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలన్నారు. పంట మార్పిడి పద్ధతులు పాటిస్తూ సుస్థిర ఆదాయాన్ని రాబట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రశాంత్, వాణిశ్రీ, మధుబాబు, పల్లవి, లతీఫ్, పాషా, ఏఈవోలు పృథ్వీ, అనుజ్ఞ, నివేదిత, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలను తరలించడం విరమించుకోవాలి

బెజ్జంకిలో ప్రధానోపాధ్యాయురాలు రేవతికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

బెజ్జంకి, మే 13: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను వేరే దగ్గరకు తరలించడం సరికాదని, ఆప్రక్రియను వెంటనే విరమించుకోవాలని గ్రామస్తులు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతికి వినతి పత్రం అందజేశారు. పాఠశాల తరలించడం వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బోనగం రాజేశం, రాజేందర్, విష్ణు, రామణాచారి తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో ఇంటర్ అడ్మిషన్లు

కొమురవెల్లి, మే 13: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఈవిద్యాసంవత్సరం ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ అయినట్లు ఆపాఠశాల స్పెషల్ ఆఫీసర్ పి.నీరజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఈసీ గ్రూపులు ప్రారంభించినట్లు తెలిపారు. ఆయా గ్రూపుల్లో చేరే విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు షార్టుమెమో, ఆధార్ కార్డు జీరాక్స్, ఫొటోలు తీసుకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చన్నారు.

సీపీఐ ఆకునూరు గ్రామ కమిటీ ఎన్నిక

చేర్యాల, మే 13 : సీపీఐ ఆకునూరు గ్రామ కమిటీ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగినట్లు ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ తెలిపారు.గ్రామశాఖ కార్యదర్శిగా పోశబోయిన పరమశేఖర్, సహాయ కార్యదర్శులుగా కడ్డూరి పుల్లారెడ్డి, బోయిని మల్లేశం, కోశాధికారిగా మీనుగు బాలరాజు, కార్యవర్గ సభ్యులుగా అమరగొండ నర్సింహులు, బూరుగుల వీరయ్య, తోకల వెంకటేశ్, దొమ్మాట వినయ్, రాములు, మల్లేశం, బోయిని రాజు, ఉడుత సత్యనారాయణ, కౌన్సిల్ సభ్యులుగా ఎర్ర అశోక్, ఉడుత మహేందర్, రాజు ఎన్నికయ్యారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్కూక్, మే13: మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన నరిగె సంధ్యారాణి ఇటీవల అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందింది. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.30,000 వేలు మంజూరయ్యాయి. మంగళవారం బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ పాండుగౌడ్, రామచంద్రం సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్

గజ్వేల్,మే13: గజ్వేల్ పట్టణంలో మంగళవారం 2025 విద్యాసంవత్సరం పాలిసెట్ ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షా కోఆర్డినేటర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, సారంగపాణి ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గజ్వేల్ జీఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలల్లోని పరీక్షాకేంద్రాల్లో మొత్తం 1195 మంది విద్యార్థులకు 1129 మంది (94.47శాతం) హాజరైనట్లు వారు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

వర్గల్, మే13: అప్పులబాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని వేలూర్‌లో జరిగింది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకింది మహేశ్(36) తూప్రాన్‌లోని ఓదుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఆ ఇల్లునిర్మాణంలో ఉండగానే రోడ్డు ప్రమాదంలో అతడి కుడికాలు విరగగా ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో ఇంటి నిర్మాణంకోసం చేసిన అప్పులు ఎక్కువయ్యాయి. మంగళవారం ఉదయం అతడి భార్య కూలీ పనికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మహేశ్ కుటుంబ సభ్యులను మాజీ ఎంపీటీసీ సంతోష్‌ప్రవీణ్ గౌడ్,మాజీ ఉపసర్పంచ్ మధుయాదవ్, బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.

దిశ కమిటీ జిల్లా సభ్యురాలిగా వనజ

చిన్నకోడూరు, మే 13: మండలంలోని రామంచకు చెందిన తిప్పని వనజను దిశ కమిటీ జిల్లా సభ్యురాలిగా మంగళవారం కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. తనపై నమ్మకం ఉంచి దిశ కమిటీ జిల్లా సభ్యురాలిగా నియమించ